


బారెడు పొద్దెక్కింది.

పెరట్లో బాదం చెట్టు మీద కాకులు గోలగా అరుస్తున్నాయి.

వుష్... వుష్ అంటూ వాటిని తోలుతూ నీళ్ళ బక్కెట్టు తీసుకుని స్నానానికి వెళ్ళబోయింది సరస్వతమ్మ.

బాత్‌రూమ్ గోడవారగా ముడుచుకుని బెదురుగా చూస్తున్న పిల్లకాకిని చూసి, "వీటి దుంపతెగ, దీని కోసమా ఇంతగోల!" అనుకొంది. అంతలోనే తల్లి కాకి మిరపకాయ కొరికినట్టుతెగ అరుస్తూ నెత్తిమీద ముక్కుతో పొడవడానికి వలయాలు తిరుగుతుంటే బక్కెట్టు అక్కడే వదిలేసి, "ఏమండోయ్!" అంటూ ఓ కేక పెట్టి పరుగులాంటి నడకతో వెనక్కి వచ్చింది.

పేపరు చదువుకొంటున్న పరమేశ్వరం హడావిడిగా పెరటివైపు వచ్చాడు.

"చూశారా వీటి ఆగడం! పిల్లకాకొటి గూట్లోనుండి జారిపడింది కాబోలు. దానినెవరేం చేస్తారో అన్న భయంతో కాపుకాచుకుని అరుస్తూ అటు వెళితే పొడిచేలా వున్నాయి. తీరా స్నానం చేద్దామని నీళ్ళు తోడుకుంటే ఈ సంతొకటి!"

పరమేశ్వరానికి నవ్వొచ్చింది. "ఇదా నీ గోల. ఇంకా ఏమిటో అని హడిలిపోయాను. సరే ఆ క్రర తీసుకుని నేను కాకుల్ని తోలుతాను. నువ్వెళ్ళి స్నానం చేసి రా" అంటూ పాదులమధ్య పడివున్న క్రర తీసుకుని గాలిలో ఆడిస్తూ అటూ ఇటూ తిరగడం మొదలుపెట్టాడు.

"రేపు మనవళ్ళొచ్చినప్పుడు కూడా ఈపని అప్పగించి నా పరువు తీస్తావా ఏమిటి?"

"బావుంది. వాళ్ళ దేశంలో మాత్రం కాకులుండవా?"

"ఉన్నా అక్కడ తెల్లకాకులే వుంటాయి. అమెరికా అనుకొన్నావా, ఆముదాలవలసనుకొన్నావా?"

"ఏం బడాయి!" వెక్కిరించింది సరస్వతమ్మ.

నాలుగు రోజుల నుంచి వాళ్ళకి మహా ఉత్సాహంగా వుంది. ఏ మాట మాట్లాడుకున్నా హాస్యంగా, వెక్కిరింతగా అనుకొంటూ మురిసిపోతున్నారు.

ఆమె పూజ ముగించుకుని కాఫీ పట్టుకొచ్చేసరికి పరమేశ్వరం బట్టలు వేసుకొని బయటకు వెళ్ళేందుకు సిద్ధంగా వున్నాడు. "మళ్ళీ వాళ్ళొచ్చేక హడావుడి పడితే కాదు. ఏమేం కావాలో చెబితే అన్నీ పట్టుకొస్తాను."

"బావుంది. అబ్బాయి ఇంకా ఎప్పుడు బయలుదేరేదీ రాయనే లేదు. మీ హడావుడికి మాత్రం అంతు లేదు."

"మూడేళ్ళకుగాను వస్తున్నాడు. ఇవ్వాళ కాకపోతే నాలుగు రోజులకయినా రాకపోడు. వాళ్ళు వున్న వారం రోజులు నేను ఇల్లు కదలకుండా వాళ్ళతోనే గడపాలి సరస్వతీ! చెప్పు. ఏమేం కావాలో" ఉద్వేగంతో అన్నాడు పరమేశ్వరం.

సరస్వతమ్మ హృదయం చెమర్చినట్టయింది. ఒక్కగానొక్క బిడ్డ పెద్ద చదువులు చదివి గొప్ప పదవి కోసం దేశం కాని దేశం వెళ్ళి వున్న ఆనందమే కాని కళ్ళకెదురుగా లేడనే బాధ సామాన్యమైనదా? మూడేళ్ళుగా వాడి రాకకోసం కళ్ళల్లో ఒత్తులు వేసుకొని ఎంతగా ఎదురుచూస్తున్నారు!

కావలసినవి చెప్పి భర్తను పంపించి గేటు వేసి లోపలకొస్తుంటే గోడవారగా నున్న జామచెట్టు కొమ్మలు ఎవరో లాగుతున్నట్టనిపించి అటు చూసింది. స్కూలు పిల్లలు కొంతమంది కొమ్మలు లాగుతూ జామకాయుం కోసం ఎగురుతున్నారు.

సరస్వతమ్మకు కోపం ముంచుకొచ్చింది. "ఓ చెంప ఉడతలూ, చిలకలూ రాల్చేస్తుంటే, మరో చెంప కొమ్మా రెమ్మా విరుస్తూ వీళ్ళొకళ్ళు. మాయదారి సంత" అనుకొంటూ అటు వెళ్ళి పిల్లల్ని కేకలేసి దూరంగా తరిమింది.

ఇన్నాళ్ళ శ్రమ ఫలించి చెట్ల నిండుగా కాయలు పడ్డాయి. పూలమొక్కలు నిలువెల్లా పూసి కళకళలాడుతున్నాయి.

మనవడికి చెట్లెక్కి దోర దోర కాయలు కోసుకొని తినడం అంటే ఎంతిష్టమో! ఇక మనవరాలైతే పూల మొక్కల్నిచూసి మురిసిపోతూ ఎంతసేపూ అక్కడే ఆడుకొంటూ వుంటుంది. ఒక్క పువ్వు తెంపనియ్యదు. అందుకే వాళ్ళిద్దరికోసం తోటంతటినీ వెయ్యి కళ్ళతో కాపలా కాస్తూ ఎంతో కష్టపడ్డారు దంపతులు.

వంట పూర్తిచేసి పెరటి తలుపులు వేస్తూ చూసింది కాకిపిల్ల కోసం.

మాతి చప్టామీద మెతుకూ మెతుకూ ఏరి దాని నోట్లో పెట్టి తినిపించె తల్లి పిల్లకాకికి ఎగరడం నేర్పించాలని కాబోలు నోట్లో ఆహారం పెట్టుకొని అందనివ్వకుండా వెనక్కి వెళుతూంది. రెక్కలొచ్చిన పిల్ల ఆహారం కోసం ఎగురుతూ తల్లివెంట పడుతోంది.

సరస్వతమ్మ పెదవులపై పల్చని చిరునవ్వు కదిలింది.

తల్లి తన బాధ్యతను ఎంత చక్కగా నిర్వర్తిస్తుందో అనుకొంది.

పనిమనిషితో ఇల్లు దులపించి కడిగించింది. కర్టెన్లు మార్చి కొత్తవి వేసింది.

ఎండన పడి ప్రతిపూటా పోస్టాఫీసు వరకు వెళ్ళి రావడం మామూలయింది పరమేశ్వరానికి. భార్య ఎంత చెప్పినా ఏదో ఒక సాకుతో బయటపడేవాడు ఇంట్లోనుంచి.

మంగమ్మతో మినప సున్ని విసిరిస్తూ కొడుకు, కోడలి గురించి ఏవేవో కబుర్లు చెబుతుండగానే వచ్చాడు పరమేశ్వరం. సరస్వతమ్మలేచి మంచినీళ్ళు తెచ్చి అందించింది భర్తకి.

"ఈవేళయినా జాబొచ్చిందా?"

గటగట మంచినీళ్ళు తాగి గ్లాసు భార్య చేతికిచ్చి, "మనం కళ్ళల్లో ఒత్తులువేసుకుని ఎదురు చూసినంతసేపు పట్టలేదు సరస్వతీ వాళ్ళ అభిప్రాయం మారిపోవడానికి. ఇండియాలో ఎండలు భరించలేమని పిల్లలు గొడవపెట్టడంవల్ల ఈ వేసవి ఆ దేశంలోని చల్లని ప్రదేశాలకు వెళ్ళి గడపాలని నిర్ణయించుకొన్నారట. మళ్ళీ సెలవులు వచ్చినప్పుడు తప్పకుండా వచ్చేందుకు

ప్రయత్నిస్తామని రాశాడు కొడుకు'' అన్నాడు నిట్టూర్పుతో.

హతాశురాలైంది సరస్వతమ్మ. కళ్ళు తిరిగినట్టని పించినా ప్రయత్నం మీద నిలదొక్కుకుంది.

''మంగమ్మా! విసిరిన వరకు చాలుగాని ఇక వెళ్ళి నీ పనులు చూసుకో. ఏదో బిడ్డల చదువుకు అక్కర కొస్తాయని నాలుగు డబ్బుల కోసం రెక్కలు ముక్కలు చేసుకొంటున్నావు. కాని వాళ్ళకు రెక్కలొస్తే నీకందరని తెలుసుకో, చాలు'' అంటూ ఎగసివస్తున్న దుఃఖంతో లోపలకు వెళ్ళి మంచంమీద వాలబోతూ, పెరట్లో కాకి గొంతు తెగేలాఅరుస్తుండడంతో అటు చూసింది.

తల్లికాకి ఎటో ఎగిరెళ్ళిపోయిన పిల్లకోసం నాలుగు దిక్కులూ కలియజూస్తూ వెర్రిగా అరుస్తోంది.

అంత దుఃఖంలోను నవ్వొచ్చింది సరస్వతమ్మకు. ''పిచ్చిదానా! రెక్కలొచ్చింది ఎగిరెళ్ళి పోవడానికేగాని నిన్నంటిపెట్టుకొని వుండేందుకు కాదు'' అనుకొంది.

ఆ పడుకోడం పది రోజుల దాకా మూసిన కన్ను తెరవకుండా వుంది సరస్వతమ్మ. పరమేశ్వరానికి చెయ్యి విరిగినట్లయింది. సకల సపర్యలు తనే చేసి భార్యను కంటికి రెప్పలా కాపాడుకొన్నాడు.

ఆ రోజు పథ్యం తీసుకుని కొంచెం అటూ ఇటూ తిరగడం మొదలుపెట్టింది సరస్వతమ్మ. చిన్న చిన్న పనులు చేసుకొని పెరట్లో పూల మొక్కల్నీ, ఫల వృక్షాలను పరామర్శించింది.

యమగంటుల
మల్లికార్జునరావు
సంచలనాత్మక సీరియల్
ది నీడిల్
త్వరలో ప్రారంభం

కాని గుండెల్లో ఏదో వెలితిగానే అనిపించింది. పరమేశ్వరం కూడా శుష్కించి వున్నాడు.

హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్లు బాదం చెట్టు దగ్గర కొచ్చింది ఆమె.

కాకి గూట్లో కీచుకీచు మంటూ ఎర్రటి ముక్కులు తెరచి గోలగా అరుస్తున్నాయి పిల్లలు. కొంచెం దూరంలో మెతుకూ మెతుకూ ఏరుతున్న తల్లికాకి రివ్వున ఎగిరొచ్చింది.

సరస్వతమ్మకు ఎంతో ఆశ్చర్యంగా అనిపించింది.

మొన్నటివరకూ రెక్కలొచ్చి ఎగిరెళ్ళిపోయిన పిల్ల కోసం హృదయవిదారకంగా అరచి గీపెట్టిన తల్లేనా ఇది అనుకొంది. అలా ఎంతసేపు వాటిని చూస్తూ నిలబడిందో ఆమెకే తెలియదు.

* * * *

సరస్వతమ్మ ఇల్లంతా సందడిగా వుందిప్పుడు., ఇంటినిండా ఆడుతూ, పాడుతూ పిల్లలు గంతులేస్తున్నారు. వాళ్ళకు పువ్వులిచ్చి, కాయలు కోసిచ్చి పిల్లల్లో పిల్లలుగా కలిసి ఆడుతున్నారు పరమేశ్వరం సరస్వతమ్మ దంపతులు.

''మీలో ఎవరికేం ఇష్టమో చెప్పండర్రా చక్కగా నేర్చుకొందురుగాని'' పిల్లలందరినీ దగ్గరకు పిలిచి అడిగింది.

''నాకు డాన్సు.''

''నాకైతే బొమ్మలేయడం ఇష్టం.''

''నేను పాటలు పాడుతాను.''

''అలాగలాగే, రేపటి నుండి మాస్టారు వస్తారు. చక్కగా నేర్చుకోండి'' ఉత్సాహంతో అంది.

పరమేశ్వరం భార్యవేపు వింతగా చూశాడు. ఆయన కళ్ళలోకి మృదువుగా చూస్తూ, ''అవునండీ! రెక్కలొచ్చి ఎగిరెళ్ళిపోయిన పిల్లలగురించి బతుకంతా ఎదురు చూడడం కంటె రెక్కలురాని ఈ చిన్నారులకు రెక్కలొచ్చే అవకాశం కలిగిస్తే బతుకెంత మధురంగావుంటుందో తెలుస్తుందిప్పుడే'' అంది సంతోషం నిండిన మనసుతో.

పరమేశ్వరం తృప్తిగా నిట్టూర్చాడు.

శిరోజాభివృద్ధికి నల్లని మరుల కొలుపు కురులు


విమల్
అమ్లా బ్రిలియంటైన్
అందమైన ముఖ వర్చస్సుకు
విమల్
ఎక్సెబరన్స్ టాల్క్


విజయా కెమికల్స్, A.P. 45/2, క్లైమన్స్ రోడ్, మద్రాస్-7.
ఆంధ్రదేశం అంతటా పంపిణీదారులు కావలెను.

స్థాపితం:1962
ఫోన్స్: 32084
31977
శ్రీ విద్యావిహార్

కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ సెంటర్
రింగ్‌రోడ్, లలితానందనగర్,
గుంటూరు-522006
బ్రాంచి: దాసరివారివీధి, విజయవాడ - 2
సైనికస్కూలు, కోరుకొండ
& R.I.M.C. డెహరాడూన్
1988 ఫిబ్రవరి ప్రవేశపరీక్షలకు
అత్యున్నత శిక్షణ!!
వయస్సు: 10 నుండి 12 సం॥ల లోపు
ప్రాస్పెక్టస్ కొరకు వెంటనే వ్రాయండి!!
డైరెక్టర్:
యం.వి. రామకృష్ణారావు
PRAGATHI.